క్లుప్తంగా

నేడు కడప ఎంపీ అవినాష్‌రెడ్డి రాక

వేంపల్లె : మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఆదివారం ప్రారంభించడానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మండలానికి రానున్నట్లు జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబులరెడ్డిలు తెలిపారు. గ్రామంలోని ప్రజల సమస్యలు అర్జీల రూపంలో స్వీకరిస్తారన్నారు. అనంతరం వేంపల్లెలోని వివిధ కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొంటారన్నారు.

12 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంటు

కమలాపురం : స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో ఈనెల 12వ తేదీ నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ సునీల్, దినకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్ పీస్ లెదర్ బాల్‌తో నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.30వేలు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.1100 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 79951 28196, 82476 44591 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జగనన్న కాలనీ రిజిస్ట్రేషన్ పత్రాల పరిశీలన



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో మధుసూదన్

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ సచివాలయంలో జరుగుతున్న జగన్న కాలనీల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని శనివారం కడప ఆర్డీవో మధుసూదన్ ఆకస్మికంగా తనిఖీ చేసి పత్రాలను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా చేయాలని అధికారులకు సూచించారు. దీంతో వారికి సంపూర్ణ శాశ్వత హక్కులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, డీటీ అంజనాగౌరి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మిపతి పాల్గొన్నారు.

దశరథ మహారాజు సన్నిధిలో రామకోటి



దశరథ మహారాజు ఆలయ వద్ద రామకోటి రాస్తున్న భక్తులు

చక్రాయపేట : మండలంలోని నాగలగుట్టపల్లె వద్ద వెలసిన కౌసల్య సుమిత్ర కైకేయి, దశరథ మహారాజు ఆలయం వద్ద శనివారం రామకోటి రాయించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆలయ ధర్మకర్త దశరథ తెలిపారు. ఎంతో పవిత్రమైన శ్రీరామ అను పవిత్రమైన రామనామం భక్తులు రాయడం, పలకడం ఎంతో పూర్వజన్మ సుకృతం అని ఆయన తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి శనివారం ఇక్కడ రామకోటి రాసేకార్యక్రమం జరుగుతూనే ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం గుల్లకుంటలో ఉన్న ఏపీ సాంఘీక గురుకుల విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుల్లకుంటలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఎస్సీ, ఎస్టీ బీసీ, ఓసీ అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీషు మీడియం విద్యను బోధిస్తారన్నారు. అభ్యర్థులను ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు 9704550130 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గేదెను కాపాడిన మున్సిపల్ సిబ్బంది

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న కాలువలో శనివారం పడిపోయిన గేదెను మున్సిపల్ సిబ్బంది కాపాడారు. స్థానికులు మున్సిపల్ సిబ్బందిని అభినందించారు.

వైవీయూలో పలు విభాగాల తనిఖీ

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో పలు విభాగాలను శనివారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నియంత్రణ అధికారి పర్యవేక్షణలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం సైన్స్ బ్లాక్ లో బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగ తరగతి గదులకు వచ్చారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. సైన్స్ బ్లాక్ లో పలు విభాగాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ విభాగాన్ని పరిశీలించారు.

సమగ్ర గ్రామీణాభివృద్ధే జగనన్న ధ్యేయం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



చిలేకాంపల్లెలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చక్రాయపేట : సమగ్ర గ్రామీణాభివృద్ధే జగనన్న ధ్యేయంగా పాలన సాగిస్తున్నాడని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని చిలేకాంపల్లెలో నూతనంగా రూ.2 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, స్త్రీ శక్తి భవన్, డిజిటల్ లైబ్రరీ, పాలకేంద్రం భవనాలను, అలాగే రూ.67.5 లక్షల పాడా నిధులతో చక్రాయపేటలో నిర్మించిన శ్రీవేంకటేశ్వర, రాచరాయస్వామి కల్యాణ మండపాన్ని ప్రారంభించి మాట్లాడారు. చక్రాయపేట మండలంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ముఖ్యమంత్రి జగనన్న హయాంలో జరిగిందన్నారు. అద్దాలమర్రి, కె.రాజుపల్లెల వద్ద పాపాఘ్ని నదిలో హైలెవెల్ బ్రిడ్జిలు, పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. వెన్నపల్లె - గండి కొవ్వూరు మధ్యలో బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయన్నారు. రైతులకు ప్రతి ఎకరాకు నీరు అందించాలన్న సంకల్పంతో రూ.2వేల కోట్లతో కాలేటి వాగు అభివృద్ధి పనులు పూర్తి కావస్తున్నాయన్నారు. రూ.20 కోట్లతో గండి దేవస్థానం అభివృద్ధి, సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, సబ్‌స్టేషన్‌లు, తారు రోడ్లు, సిమెంటు రోడ్లు ఇలా ఎన్నో అభివృద్ధి పనులతో చక్రాయపేట మండలాన్ని అభివృద్ధి చేశామన్నారు. అంతకు ముందు మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి కొండవాండ్లపల్లెలో నూన ప్రాథమిక పాఠశాల భవనం, డిజిటల్ లైబ్రరీ, మారెళ్లమడక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయ భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, సర్పంచులు బోగాదమ్మ, హర్షాద్, నరసింహులు, ఎంపీటీసీలు కాంతమ్మ, లీలావతి, కిరణ్, ఏపీ టూరిజం రాష్ట్ర మాజీ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మానందరెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదరావు, మండల యూత్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, రాచరాయస్వామి దేవస్థానం చైర్మన్‌లు రామాంజనేయరెడ్డి, చక్రపాణిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, పార్టీ నేతలు మహేశ్వరరెడ్డి, పార్థసారథిరెడ్డి, శ్రీరామమూర్తి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మంచి కోరేది జగనన్న ప్రభుత్వమే



సంక్షేమ ఫలాల పత్రాలను ప్రజలకు అందిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ప్రజల మంచి కోరే ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వెలమవారిపల్లె వార్డు సచివాలయ పరిధిలోని బొగ్గుడుపల్లె, పోలేపల్లె, బసిరెడ్డిపల్లె గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు చేస్తున్న మంచి గురించి వివరిస్తూ పేదల పక్షపాతి సీఎం జగన్ అన్నారు. ఆయన బలం ప్రజలేనన్నారు. విద్యకు సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లా, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్ రంగనాయకులు, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ మహాసభను విజయవంతం చేయండి

పెండ్లిమర్రి : కడప నగర శివారులోని డీఎస్ఆర్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించే కమలాపురం నియోజకవర్గ యాదవుల ఆత్మీయ మహాసభను విజయవంతం చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య పిలుపునిచ్చారు. శనివారం పెండ్లిమర్రిలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని యాదవులందరు ఒకతాటి మీదకు తీసుకవచ్చి వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని యాదవులందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ సురేష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రోడ్డు జాతీయ 35వ వారోత్సవాలలో భాగంగా శనివారం ట్రాఫిక్ నియమాలపై సీఐ సురేష్‌రెడ్డి పట్టణంలోని నారాయణ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇష్టం వచ్చినట్లు వాహనాలో వెళ్తున్నారని అలా వెళ్ల కూడదన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు ఆలోచించాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల వారు అతివేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు కూడా లైసున్సులు ఉండాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించకపోతే జరిమాన వేస్తారన్నారు.

పథకాల కొనసాగింపు జగనన్నతోనే సాధ్యం



కొత్తగాలివారిపల్లె ప్రచారంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి

వల్లూరు : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, వాటి కొనసాగింపు ఆయనతోనే సాధ్యమని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బాకరాపురం, కొత్తగాలివారిపల్లె గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ నేతలతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను ఆరా తీశారు. ప్రజలకు అందుతున్న పథకాలన్నీ కొనసాగాలంటే జగన్ తిరిగి సీఎం కావాల్సిన అవసరం వుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డి, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ కాంతమ్మ, పార్టీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, మస్తాన్, పుల్లయ్య, రిటైర్డ్ ఎస్ఐ జగన్ మోహన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ లీలా విలాసం



భక్తులకు ప్రవచనాలను బోధిస్తున్న బ్రహ్మానంద సరస్వతిస్వామి

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో శనివారం నైమిశారణ్యం పీఠాధిపతులు హిందూ ధార్మిక సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ బాలబ్రహ్మానంద సరస్వతి స్వామిజీచే హనుమాన్ లీలా విలాసం, దేవతా విజ్ఞానం గురించి ప్రవచనాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గండికి వచ్చిన భక్తులు ప్రవచనాలను ఆసక్తిగా ఆలకించారు. అనంతరం ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉపప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు పూర్ణ కుంభంతో స్వాగతించారు.

పిల్లలను కష్టం తెలిసేలా పెంచాలి



మాట్లాడుతున్న కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు అనుపమానందజీ మహారాజ్

వేంపల్లె : పిల్లలకు ఏ కష్టం తెలియకుండా పెంచామని తల్లిదండ్రులు గొప్పలు చెప్పకుండా కష్టమేంటో తెలిసేలా, సమాజం పట్ల అవగాహనను కలిగిస్తూ పెంచే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు శ్రీమత్ అనుపమానందజీ మహారాజ్ తెలిపారు. శనివారం స్థానిక స్వామి వివేకానంద ఉన్నత పాఠశాల 23వ వార్షికోత్సవ సమావేశంలో ఆయన పాల్గొని తల్లిదండ్రులకు, విద్యార్థులకు సూచనలు చేశారు. అలాగే సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ శ్రీ అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జ్ఞానానికి, ఏకాగ్రతకు స్వామి వివేకానంద మారుపేరన్నారు. అనంతరం మండల స్థాయిలో వివిధ కేటగిరీలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులను, పదవ తరగతిలో గరిష్ట మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు. ఆటల పోటీలలో రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు వేసిన వివిధ సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ 2 స్టాలిన్, పాఠశాల కరస్పాండెంట్ పాల్గొన్నారు.

భాషపై పట్టు సాధించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో ఉన్న కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆంగ్ల ఉపన్యాస పోటీలు జమాత్ ఉస్ సలిహాత్ మాదర్సా విద్యార్థులకు నిర్వహించారు. వారు వివిధ అంశాల మీద విద్యార్థులకు ఉపన్యాసాలు ఇచ్చారు. ఇందులో ముఖ్య అతిథిగా మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ సికందర్ హుస్సేన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఉర్దూ, తెలుగుతో పాటు ఇంగ్లీష్ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు.

మీ కుటుంబానికి ప్రయోజనం చేకూరితేనే ఓటేయండి



కమలాపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మీ కుటుంబానికి ప్రయోజనం కలిగి ఉంటేనే ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ సాదిక్ తదితరులు శనివారం 12,13వ వార్డుల్లో ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి వారికి ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో మాత్రమే అమలు అవుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ తిరిగి రావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు. మీ కుటుంబానికి ప్రయోజనం కలిగి ఉంటేనే త్వరలో జరిగే ఎన్నికల్లో తప్పని సరిగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మస్తానయ్య, మాజీ సర్పంచ్ దేవదానం, గౌస్‌మున్నా, గౌస్‌మోదీన్, షావలి, మాస్, జిలానీ, నాగేశ్వర్‌రెడ్డి, జెట్టి నగేష్, బాబ్జీ, జాఫర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రజ్ఞా వికాసం టెస్ట్‌ను విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కమలాపురం : ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రజ్ఞ వికాస్ మోడల్ టెస్ట్ పరీక్షలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం కమలాపురంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి, న్యాయవాది ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో ఉన్న భయం పోగొట్టేందుకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ప్రతి ఏటా ప్రజ్ఞ వికాసం పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. ఈ పరీక్ష పేపరును ప్రముఖ విద్యావేత్త కేఎస్ లక్ష్మణరావు తయారు చేస్తారన్నారు. 100 మార్కులకు ఆబ్జెక్టివ్ పద్ధతిలో టెస్ట్ ఉంటుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు రూ.20 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 97052 73497 నెంబర్‌కు సంప్రదించాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి మహిళా క్రికెట్ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన పులివెందుల మహిళా క్రికెట్ జట్టు

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలలో భాగంగా కడప జిల్లాస్థాయిలో నిర్వహించిన మహిళా క్రికెట్ పోటీలలో పులివెందుల నగరిగుట్ట సచివాలయం మహిళా క్రికెట్ జట్టు మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పులివెందుల మహిళా క్రికెట్ జట్టు రాష్ట్రస్థాయికి ఎంపికకావడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కడప కార్పొరేటర్ సూర్యనారాయణ చేతులమీదుగా బహుమతులను అందుకున్నారు.

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : జగనన్న ఇచ్చిన సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన జరుగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని మూడవ వార్డు సుందరయ్యకాలనీలో మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డితో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని కోరారు. ప్రస్తుతం అర్హత కలిగిన వారందరికీ స్థలాలిచ్చి సొంతింటి కలను సాకారం చేయాలని రెవెన్యూ, హౌసింగ్ అధికారులకు ఆయన సూచించారు. టీడీపీ నాయకులు 2014-19 కాలంలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు బాలయ్య, ఆ వార్డు కౌన్సిలర్ భాస్కర్, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వజ్రా డెవిడ్, పార్టీ నాయకులు, సురేష్(కర్ణ), రఘురాముడు, కార్యకర్తలు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరుతున్న మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీలు, కులాలు, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని యలంకూరుపల్లె, గార్లమిట్టపల్లె, వీరపునాయునిపల్లె గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఓటర్లను విన్నవించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల ముఖాల్లో చిరునవ్వు, ప్రతి మహిళా లక్ష్యాధికారి కావాలన్న సంకల్పం, ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలనే తపనతో వైఎస జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చెపుతున్న బూటకపు మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో కమలాపురం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వీరపునాయునిపల్లె, ఉరుటూరు ఎంపీటీసీలు రాఘవ యాదవ్, లక్ష్మిరామాంజనమ్మ, సర్పంచులు మణికంట, పుల్లయ్య యాదవ్, నాయకులు రామాంజనేయరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గంగయ్య యాదవ్, సాంబశివారెడ్డి, ప్రతాప్ యాదవ్, రవి, మహేశ్వర్‌రెడ్డి, నాగభూషణం, శ్రీనివాసుల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులకు బహుమతులను ప్రధానం చేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

వేంపల్లె : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని స్వామి వివేకానంద హైస్కూల్ యాజమాన్యం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. స్వామి వివేకానంద జీవిత విశేషాలు, ఆయన ప్రసంగాలపై విద్యార్థులలో అవగాహన పెంచేందుకు వివేకానందుని జీవితం, సందేశం అనే అంశంపై వ్యాసరచన, క్విజ్, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థినీలు నవ్యశ్రీ, లతలు వరుసగా ప్రథమ, ద్వితీయస్థానాలను సాధించారు. కార్యక్రమంలో సమన్వయకర్తగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్సెస్ విభాగాధిపతి మాధవరావు వ్యవహరించారు. విద్యార్థినులను అభినందిస్తూ జరిగిన కార్యక్రమంలో కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్ నాగలక్ష్మిదేవి, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యసాధన కోసం కృషి చేయాలి



బహుమతులను అందుకుంటున్న విద్యార్థినులు

వేంపల్లె : విద్యార్థులు చదువులో రాణించేందుకు లక్ష్యసాధన కోసం కృషి చేయాలని జెడ్పీటీసీ రవి కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబులరెడ్డిలు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల నుంచి పురవీధులగుండా నాలుగురోడ్ల కూడలి వరకు స్థల దాతలు సుబ్రమణ్యం, శేషమ్మ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం ఏర్పాటు చేయడంవల్ల కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు సుముకత చూపిస్తున్నారన్నారు. అనంతరం అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం స్థలదాతలను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శివమునెమ్మ, ఎంపీటీసీ భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం



ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

పులివెందుల రూరల్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా డ్వాక్రా మహిళలకు వైఎస్సాఆర్ ఆసరా నాలుగో విడత రుణాలను మహిళల ఆకౌంట్లో జమచేయడంతో పొదుపు సంఘాల మహిళలు ఉల్లిమెల్ల గ్రామంలో శనివారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంఘంలోని సభ్యులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కచెల్లమ్మలకు చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా ద్వారా రుణాలు మహిళల అకౌంట్లో జయ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆసరా ద్వారా వచ్చిన డబ్బులకు తమ కుటుంబాలలోని పిల్లల ఉన్నత చదువులతోపాటు కుటుంబ పోషణకు ఉపయోగిస్తామన్నారు. మహిళలు లక్ష్యాధికారులు కావాలన్నదే సీఎం ఆశయమన్నారు. ఆయనకు మహిలందరూ ఎంతో రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆర్పీ ఈశ్వరమ్మ, కౌన్సిలర్ పద్మావతి, రోటరీపురం ఆర్పీ రమణమ్మ, కౌన్సిలర్ సలీమాల, వైఎస్సార్ సీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శివనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసుల పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు



క్లబ్ ఆవరణలో తాగిపడేసిన మద్యం సీసాలు, వాటర్‌ప్యాకెట్లు

ముద్దనూరు : ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల సమీపంలో అసాంఘిక కార్యకలాపాలు అడ్డూ అదుపులేకుండా సాగుతున్నాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయ రహదారిలో మూసివేసిన ఓ క్లబ్ మైదానంలో ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యం మందుబాబులు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. క్లబ్ ఆవరణలో తాగిపడేసిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళలో పాతభవనంలో పేకాట కూడా సాగుతున్నట్లు సమాచారం. క్లబ్ ఆవరణ పక్కనే తహసీల్దారు కార్యాలయం, ఎదురుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, మరో పక్క ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వున్నాయి. దీనికి తోడు ఆఫీసుల్లో పనుల నిమిత్తం వచ్చేవారంతా నీడకోసం ఈ క్లబ్ ఆవరణలోనే సేదతీరుతుంటారు. ఈ ప్రదేశంలో పట్టపగలే బహిరంగంగా మద్యం సేవిస్తుండటంతో చుట్టుపక్కల వారికి, మహిళలకు ఇబ్బందికరంగా వుందని పోలీసులు తగిన చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.